# అమ్మా ! ఒకసారిలా రావే

సీతామహాలక్ష్మికి చెప్పలేనంత నీరసంగావుంది. పొత్తికడుపుపచ్చి పుండులా వుంది. వళ్ళంతా వల్లమాలిన సలుపు. పిక్కలు ఒకటే పీకు. అయితేనేం గాక మనసెంతో ఉల్లాసంగా వుంది. పువ్వులా గాలి అలల్లో తేలి పోతున్నాది. ఇన్నాళ్ళకు తనకొక కొడుకు పుట్టాడు. ఇహను తనేమయినా ఫరవాలేదు.

నలుగురు ఆడపిల్లల తర్వాత నేటికి పిల్లాడు పుట్టాడు. రేపే వాణ్ణి ఉయ్యాలలో వెయ్యడం. వాడిది అచ్చు తనపోలికే మొన్న పుణ్యాస్నానం నాడు చూసి వెళ్ళడానికి వచ్చిన మామయ్య చంటి వాణ్ని ఎత్తుకుని– "వీడు అచ్చునీ పోలికేనే సీతాలూ! చిన్నతనంలో నువ్వు అచ్చు ఇలానే ఉండేదానివి" అన్నాడు కూడానూ. ఆడపిల్లలకి తండ్రి పోలిక, మొగపిల్లలకి తల్లి పోలికవస్తే అదృష్టం అనేది అమ్మ. అమ్మమ్మా, అమ్మా ఇద్దరూ గతించి పోయారు. అమ్మేగనక వుంటే ఎంత సంతోషించును? తనకి నలుగురు ఆడపిల్లలు పుట్టినందుకు– తనకంటె తన మొగుడి కంటె, తన అత్తమామల కంటె కూడా– అమ్మే ఎంతో అంత నొచ్చుకునేది.

"అమ్మా ! చూడు నీకు మనవడు పుట్టాడు" అనుకుంది. మనసులో తల్లిని ఊహించుకుని.

సుబ్బారావు సంతోషం మరి చెప్పాలా? అసలే అతని ముఖం చాలా విశాలంగా వుంటుంది. ఇప్పుడతను మరీ విపులాస్యుడయ్యాడు. మీరు అచ్చు శివాజీ గణేశన్‌లా వుంటారని సరదాగా అంటూ వుంటుంది సీతాలు మీ నవ్వులు కాల్గేట్ నవ్వులని కూడా హాస్యం చేస్తూ వుంటుంది. అతను సిరిమల్లె సింగారంతో నోరంతా తెరచి నిండుగా నవ్వుకున్నాడు.

సీతామహాలక్ష్మిని అత్తవారింట్లో ఎవరూ సీతా అని పిలవరు అలాపిలుస్తే అన్నీ కష్టాలే పలుకు తాయట! అలనాడు సీతా అమ్మవారికి వచ్చినకష్టాలే వస్తాయట అందుకని అంతా మహాలక్ష్మి అని పిలుస్తారు. సుబ్బారావు ఏకాంతంలో సీతా అనీ, ఎంతో యిష్టంగా సీతాలు అనీ, ప్రకాశంగా బహు అయిష్టంగా మహా లక్ష్మి అని పిలుస్తాడు.

పెద్దపిల్ల చంద్రలేఖ లేతగా తోటకూర కాడలా వుంటుంది. ఎర్రగా దీపంలా వుంటుంది. దాని ఊపిరంతా కళ్ళల్లోనే వున్నట్టుంటుంది. దానివి ఆకర్ణాంత విశాలనయనాలు. మొన్న దసరాకి పన్నెండో ఏడుచొర బడింది. ఏడోతరగతి వెలగ బెడుతున్నది. పరమ అమాయకం. ఇటు పిలిస్తే ఇటు పలుకుతుంది బొత్తిగా లోకజ్ఞానం లేదు. రెండోది అత్తగారి పోలిక. నెమ్మదీ వున్నది, తెలివీ వున్నది. వయసుకు మించిన వ్యవహార జ్ఞానమూ వున్నది. మూడోదీ. నాలుగోదీ మరి చెప్పకండి మహా ప్రభో పరమ పెంకి ఘటాలు, ఆ నాలుగో దున్నదంటే అది మరీను పొరపాటున ఆడదయి పుట్టిందిగానీ, దానివన్నీ మగపోకిళ్ళే. వేలెడున్నదో లేదో ఊరంత గడుసుదనం దానికి. అన్నీ ముదివత్త మాటలే. అదంటే అందరికీ కోపమే. పెద్దపిల్లంటే సుబ్బారావుకి చాలా ప్రేమ. మూడోదంటే సీతామహాలక్ష్మికి ప్రేమ. ఆఖరిదానిమీద సుబ్బారావు తల్లికి చాలా ఆపేక్ష.

పిల్లడికి బారసాల రంగరంగ వైభోగంగా జరిగింది, మణి భూషణ రావు అనిపేరు పెట్టుకున్నారు. సుబ్బారావు నాన్నమ్మ పేరు మాణి క్యాంబ, తాతగారి పేరు నాగభూషణరావు గారు. ఆయిద్దరి పేర్లూ కలిపి అలా తయారు చేశారు. సుబ్బారావు, స్నేహితు లందర్నీ పిలిచి ఘనంగా పార్టీయిచ్చాడు.

ఈ సారి కాన్పు సులభంగానే వచ్చినా, కాన్పు తరువాత ఎందు వల్లనో గాని వల్లమాలిన నీరసంగా వున్నది. నిలబడితే, కూచోవాలనీ, కూచుంటేపడుకోవాలనీ, అనిపిస్తున్నది, చిన్నపిసరు పనిచేసినా అలసట. చంటివాడికి ఆరు నెలలునిండాక సుబ్బారావు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నాడు.

ఏమిటో చాలా నీరసంగా వుంటోందీ మధ్య పెద్ద దాన్నయిపోతున్నాను.- అనుకున్నాది సీతాలు ఓ నాడు. లోలోపలే అనుకున్నాననుకుందిగాని, ఆ మాటలు అత్తగారిచెవినపడనేపడ్డాయి.

ఏమిటే మహలక్ష్మీ - అప్పుడే పెద్ద దానివయిపోయావూ ? గత భాద్రపదంలోనే కదూనీకు మూడుపదులూనిండేయి. ఆకాడికి మావాడికంటె నువ్వునాలుగేళ్ళు చిన్నదానివి. అయిదు కాన్పులకే అలసి పోయి - అవ్వనయి పోయానను కుంటున్నావా - నువ్వింకా మాఅమ్మమ్మని చూసేవు కావు దానికి పన్నెండో ఏట పెళ్ళయిందట, పద్నాలుగునిండిపదిహేను చొరబడే సరికేనెల తప్పిందట, ఆ వరసన ఏకబిగిన పద్దెనిమిది మందిని కన్నది నలభయి నిండేటప్పటికి. అయితే కడకు ఆరుగురే మిగిలారనుకో ఎలా వుండేదనుకున్నావూ? పిడికొయ్యలా వుండేది చీకట్నే వెళ్ళి ఏటిలో స్నానంచేసి మడినీళ్ళు తీసుకొచ్చే టప్పటికి ఎవ్వరమూ లేచేవాళ్ళంకాము, చి చి ఛీ కర్రేదీ కర్రేదీ తిరుగు తిరుగు .... కాల భైరవుడు తోకాడించుకుంటూ హడావిడిగానూ బహునిరాసక్తంగానూ వెళ్ళి పోయాడు.

ఆ రోజులు వెళ్ళి పోయాయి, అప్పటి వోపికలు యిప్పుడెవరికీ వుండటంలేదు ఒకర్నో యిద్దర్నో కనేసరికే గుండె నీరసాలూ.... మాట మధ్య లోనే తుంచేసి, అన్నం పొంగుతుంటే మూతపెట్టిన సిబ్బిరేకు తీసిందావడ, వుత్త చేత్తోనే.

పాత గుడ్డ పట్టుకుని అన్నం వార్చాలన్నా సీతాలుకు జడుపే....

* * *

భోజనం చేసి నడుం వాల్చింది సీతాలు, వారపత్రిక తిరగేస్తోంది. కళ్ళుమూతలు పడిపోయాయి-

"అమ్మా ఒకసారిలా రావే- అమ్మా నిన్నేనే ఒక సారిలా రా"

పెద్దపిల్ల పిలుపువిని తుళ్ళిపడి లేచింది, చంటివాడు ఉయ్యాల్లో ఉచ్చపోసేశాడు, లేచివాణ్ణితీసి మంచం మీద వేసింది.

"అమ్మా- ఇలారావే ఒకసారి" మేక మేమే అని అరచినట్టు వుంది, ఆస్వరం. భీతితో పిలుస్తున్నాది. జాలిగొలిపేలా వున్నాది.

"అబ్బా-వస్తున్నాను ఉండవే-ఎందుకలా చెవికోసిన మేకలా అరుస్తున్నావ్," అంటూ గదితలుపు చేరవేసిబయటి కొచ్చింది.

అత్తగారు యింట్లోలేరు. ఆఖరిదాన్ని చంక నేసుకుని కామాక్షమ్మ గారింటికి వెళ్ళి వుంటుంది. రెండోదీ, మూడోదీ బళ్ళోకి వెళ్ళారు ఈమధ్య కామాక్షమ్మ కోడలు పురిపండా వారి వచన భారతం చదివి వినిపిస్తున్నదట, ఇరుగూ పొరుగూ పదిపదిహేను మంది ఇల్లాళ్ళూ భక్తురాళ్ళు అమ్మలక్కలు ఆండాళ్ళమ్మలూ చేరుతున్నారు. అలా ఆ పురాణపఠనం మూడు గంటలదాకా సాగుతుంది.

మామగారు రామవరం వెళ్ళారు. పొలం చూసుకుందుకి. ఏదిఎక్కడుందీ పెద్దది?

గదులన్నీ దాటుకుని వన్నారదాటి వంటిల్లుదాటి పెరట్లోకి వెళ్ళింది. నూతిగట్టుచాటున నుంచుంది చంద్రలేఖ. దేలకళ్ళలో జాలిగొలిపేలా మబ్బుల్లోచిక్కిన చంద్రుడిలా ఆపిల్ల మొఖం వన్నె తరిగివుంది. ఆ విశాలనేత్రాల్లో భీతి.... భీతి....బెదురు....బెదురు.... నీళ్ళు....నీళ్ళు....దుఃఖం....దుఃఖం....

జామి చెట్టునీడ పొడవుగా సాగి తూర్పుకుమళ్ళింది కొబ్బరిచెట్టు ఆకులు గలగల లాడుతూ వూగు తున్నాయి. అరటి చెట్లు పువ్వులు దింపాయి. ఇవ్వాళే వోపువ్వుకోసి పెసరపప్పు ఆరబెట్టి వొండుదాం

అను కుంది సీతాలు, కాని- మామూలు రోజుల్లో తెమిలిచావదు, ఆదివారం అయితే-తీరుబడి.

"ఎందుకలా బొబ్బలు పెడుతున్నావు-"

పరికిణి నిండా రక్తం మరకలు....

"ఏమిటి ఇదంతాను-" అన్నది సీతాలు. కానిఅంత బోధపడకపోవడానికే ముందిగనకే యిందులోనూ? వేగిరం తాటాకు చాప సిద్ధం చెయ్య్య వలసిందే.

"ఎందుకే పిచ్చిముండా కళ్ళనీళ్ళెందుకూ- నాన్నమ్మని పిలుస్తా నుండు"

ఏం చెయ్యాలో బోధపడ లేదు. కరచరణాలు ఆడేయి కావు. కామాక్షమ్మ గారింట్లో పురాణ శ్రవణానికి వచ్చిన అమ్మ లక్కలంతా ఇటేమళ్ళారు క్షణాలమీద.

సాయంత్రం అయిదుగంటలకి సుబ్బారావు యింటికి వచ్చేసరికి, యిల్లంతా చాలా అలికిడిగా వున్నది. బట్టలు మార్చుకొని నడవలోకి వెళ్ళాడు "మనచంద్ర పెద్దమనిషయిందిరాసుబ్బులూ" అన్నది అతని తల్లి చేటంత ముఖం చేసుకొని. తల్లి అతన్ని సుబ్బీ సుబ్బులూ, సుబ్బడూ అనే పిలుస్తుంది. యిప్పటికీను. చంటిపిల్లని చంకన వేసుకొనే పనులుచేస్తూ సీతాలు ముసిముసిగా నవ్వుతోంది.

నిండా పన్నెండేళ్ళులేని చంద్రలేఖ పసుపు గుడ్డల్లో బుర్రవంచుకొని చాపమీద కూచుంది. నుదుట ఎర్రని బొట్టుతో. ఆ పిల్లకళ్ళలో తడిచారుగుర్తు పట్టాడు. ఇదంతా ఏమిటో, ఎందుకో తెలీని పసి వయసు దానిది. ఇది ఆనందించవలసిన సమయమో, కాదో తెలీని అమాయికత. తననిలా దూరంగా ఎవరూముట్టుకోని విధంగా కూచో బెట్టడం, చుట్టూ అమ్మలక్కలు చేరి వూసులాడు కోవడం చూడగా ఆ పసిదానికి దిగులు దిగులుగా, బరువు బరువుగా వుంది. తానేదో నేరం చేసిన దానిలా ఫీలయిపోతోంది.

సుబ్బారావు తిన్నగా చాప దగ్గరగా వెళ్ళాడు.

"ఆ-ఆ-ముట్టుకునేరు-" అన్నది కంగారుగా సీతాలు

"చందూ-" అని, అంత దూరంలో ఆగి నేలమీద గొంతు కూచున్నాడు,

అలా కూతుర్ని పిలవడం సుబ్బారావుకి యిష్టం. ఇంకా ముద్దు వేస్తే చందమామా అంటాడు. అతనికా పిల్లంటే మిక్కిలి వాత్సల్యమూ జాలిన్నీ.

వెయ్యి రూపాయలు వొదిలిపోయినయి. సీతాలు మిరియం గాజులు బ్యాంకు వారి దగ్గర భద్రంగా ఇనప్పెట్లో నిద్ర పోతున్నాయి. కొన్నాళ్ళ వరకూ నిద్ర లేవవలసిన పని మాకు మరి లేదంటున్నాయవి. సీతాలుకు మరీ నీరసం పట్టుకుంది. తనకి వార్ధక్యం మీద పడిపోయిందన్న ఫీలింగ్ పద్దాకా ఆమెని వెంటాడుతోందీ మధ్య. పాపిట్లో వెంట్రుకలు తెల్ల బడుతున్నాయి.

మణి భూషణ రావు తప్పటడుగులు మాని తల్లినీ. నాన్నమ్మనీ పరుగులు తీయిస్తున్నాడు. ముద్దు మాటలు మాని ముదికబుర్లు చెబుతున్నాడు. ఇహపుట్టనా ఇహ పెరగనా అని ఒక్కగా నొక్క మగనలుసు........

రెండో పిల్లా పెద్ద మనిషయింది.

సీతామహాలక్ష్మి పప్పురుబ్బుతున్నది. మినప రొట్టె పెడదామని. కుర్రవెధవ మినప రొట్టె గురువువా వాడు. వీధరుగుమీద తాతగారి వొళ్ళో కూచుని మహాముద్దుగా పద్యాలు చెప్తున్నాడు.

"లింగు లింగున తిలుగునా బొంగలంబు ఏమితో వ్లాయుచున్నది యిసకలోన్హ బలికి పోలేదు. పొత్తంబు పత్తలేదూ ఎతుల వొచ్చినదో దీనికింత చదువా-"

అని దీర్ఘాలు తీస్తున్నాడు.

సీతాలు నవ్వుకున్నది. చదువులో వాడిది తండ్రిపోలికే. ఇట్టేపట్టేస్తాడు. ఇతరం అన్నిటా తనపోలికే.

ఈ మధ్య బొత్తిగా గడుగ్గాయయి పోతున్నాడు.

వుత్తరౌడీ వెధవలా తయారవుతున్నావూ— అంటే, అవున్నేను లౌలీనే అంటాడు. ముదర మాటాలూవాడూనూ.

"అవున్రా మణీ, నువ్వు లౌలీలౌలీ" అంటాడు సుబ్బారావు. సంతోషంతో పొంగి పోతూనూ. కులాసాగా నవ్వుతూనూ— పప్పురుబ్బుతూ గతుక్కుమన్నది సీతాలు.

పెరట్లో పిల్లల కేకలు.

"అమ్మా ఒకసారిలా రావే–"

ఎవరూ ఆఖరిదేనా? ఎందుకలా అరుస్తోంది?

"అమ్మా చిన్నక్క చూడవే– నువ్వొకసారి రా–"

ఇంకెవరూ? ఆఖరిదాని గొంతుకే, కొంపముంచి...... గుండెలు గుబగుబలాడి పోయాయి........

రోటి దగ్గిర్నించి లేచి పెరట్లోకి వెళ్ళేలోగా అడుక్కి, అరవయ్యారు ఆలోచనలు.... ఎన్నెన్ని భయాలు..... ఎంతెంత బెదురు..... ఏమిటో......

మూడోదీ నాలుగోదీ జాంపిందల కోసం జట్టీలాడు కుంటున్నారు

"చూడే అమ్మా– పెద్దకాయ లాగేసుకుంది నా చేతీలోంచి–"

"తన్నగలను. నోరుముయ్యి"

అలా చూస్తూ నుంచుండి పోయింది సీతాలు ఒక్క క్షణం. తాను అనవసరంగా కంగారు పడిపోయింది. అంతలోనే నవ్వుకుంది. ఇంకా ఈ రోజుల్లో కూడా ఆడపిల్లలగురించి భయంభయంగా ఆలోచించడం దేనికి అనీ అనుకుంది. పిల్లల్ని రెండుగసిరి వెనక్కి వచ్చి గబగబా పప్పు రుబ్బడం ప్రారంభించింది. నలుగురాడ పిల్లల తల్లి సీతామహాలక్ష్మి.

పిల్లలు కాళ్ళు కడుక్కుని గడపలమీంచి గంతులు వేసుకుంటూ తిన్నగా వీధరుగు మీద వున్న తాతగారి దగ్గిరికి చేరారు. ఇల్లెగిరి పోయేలాగ ఎక్కాలొకరూ. పజ్జాలొకరూ చదవడం ప్రారంభించారు.

"పన్నెండొకట్లు పన్నెండూ, పన్నెండు రొళ్..... ఇరవయ్ నాలుగూ"

"..... మాన దనాడ్యుడైన పూపతి సహించునె. సపత్నులరుద్దియి నాత్మహానియున్......"

"ఆఁఆఁ సరిగ్గా చదూ....." తాతగారి కంఠం– ఎవర్ని గద్దిస్తున్నట్టు?

సీతామహాలక్ష్మి మనసంతా విపరీత ధైర్యంతో కూడిన అధైర్యంగానో అధైర్యంతో కూడిన ధైర్యంగానో ఎలాగో ఎలాగో వుంది. మళ్ళీ మెల్లిగా పూల్‌లా తనలో తనే నవ్వుకుంది. అమ్మా ఒక్కసారిలా అనే పిలుపుకి ఈ సారి అధైర్యపడకూడదని నిర్ణయించుకుంది.

నలుగురాడ పిల్లల్ని కన్నప్పుడు లేని భీతి ఇప్పుడు దేనికీ! పెద్దమనుషులవుతున్నారంటే పెళ్ళి కెదుగుతున్నారని లెక్కే. నలుగురికీ పెళ్ళిళ్లు చెయ్యొద్దు. వెనక తాతలు సంపాయించిన ఆస్తేమీలేదు–

"కొడుకు కోసం ఆగకుండా ఇద్దరాడపిల్లల్తో ఆపరేషన్ చేయించేసుకుని వుండవలసింది–" అన్నది

"కొడుకు కావాలనుకున్నాం. ఇప్పుడు వగచడందేనికీ" అన్నాడు సుబ్బారావు.

అమ్మా ఒక సారిలారావే అని పిలుపుకు ఈ సారి భయబడకూడదని గట్టిగా నిర్ణయించుకుంది సీతాలు.

*రచన : 1980*

*ప్రచురణ : జయశ్రీ, సెప్టెంబర్ 1980.*